
సీ/డీ గ్రేడు డంపింగ్ ప్రాంతం

ముగ్గురాయి ఖాళీ..!

- రెండేళ్లలో తరిగిపోనున్న నిల్వలు
- మూతపడనున్న మంగంపేట గనులు
- ఉపాధి కోల్పోనున్న కార్మికులు, ఉద్యోగులు


ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మంగంపేట ముగ్గురాయి గనులు రెండేళ్లకు ఖాళీ కానున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది ఉపాధి కోల్పోనున్నారు. రెండేళ్లకు గనులు ఖాళీ అవుతాయని తెలియడంతో గ్రామస్థులు, కార్మికులు, ముగ్గురాయి ఎక్స్‌పోర్టర్స్, పల్వరైజింగ్ మిల్లుల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేకోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేటలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెరైటీస్ నిక్షేపాలు ఉన్నాయి. 1958లో ఎంఎస్ సలార్‌ఉద్దీన్ అనే వ్యక్తి మంగంపేటలో లభించే ముగ్గురాయిని తమిళనాడుకు తీసుకెళ్లి పరీక్షలు చేయించడంతో వీటిలో బేరియం కెమికల్స్ ఉన్నాయని తేలింది. అనంతరం రెండు నుంచి మూడేళ్ల పాటు మంగంపేట ముగ్గురాయిపై జియలాజికల్ సర్వే చేశారు. మంగంపేటలో 74 మిలియన్ల టన్నుల బెరైటీస్ ఉందని నిర్ధారించారు. 1962-63 మధ్య కాలంలో వైఎస్ రాజారెడ్డి, కందుల ఓబుల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సీఎం రామనాథరెడ్డి, టిఫిన్ కంపెనీ అధినేత రాజగోపాల్, మంగంపేట కాపుపల్లెకు చెందిన గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంఎస్ సత్తార్‌మియా తదితర ప్రైవేటు వ్యక్తులు మంగంపేటను సందర్శించి మళ్లీ ఇతర రాష్ట్రాల్లో పరీక్షలు చేయించారు. బెరైటీస్ నిక్షేపాలు ఖరీదైనవి ఉన్నాయని నిర్ధారించుకున్నారు. 1964లో మంగంపేటలో సుమారు 5 ఎకరాల భూములను కొనుగోలు చేసి మైనింగ్ లీజుకు తీసుకుని ముగ్గురాయి ఎగుమతులు ప్రారంభించారు. 1970-71లో మంగంపేటలో ఏపీఎండీసీ (ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ)ను ఏర్పాటు చేశారు. మొదట సుమారు 4 ఎకరాల్లో ఏపీఎండీసీ మైనింగ్ ప్రారంభించింది. 1974లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు చెందిన గనుల లీజులను రద్దు చేసి స్వాధీనం చేసుకుంది.


మంగంపేట బెరైటీస్ గనులు

విదేశాలకు ఎగుమతులు

గనుల్లో ఉన్న ముగ్గురాయిని బేరియం కెమికల్స్ సాంద్రతను బట్టి ఏ-బీ-సీ/డీ గ్రేడ్లు గా విభజించారు. ప్రస్తుతం ఏ-గ్రేడు బెరైటీస్ రాయి 80 వేల టన్నులు, బీ-గ్రేడు రాయి 3,35,000, సీ/డీ గ్రేడ్ల రాయి 82 లక్షల టన్నులు వెలికి తీసినవి ఉన్నాయి. ప్రస్తుతం ముగ్గురాయి గనుల్లో ఏ-గ్రేడు 45 లక్షల టన్నులు, బీ-గ్రేడు 10 లక్షల టన్నులు, సీ/డీ గ్రేడ్లు 45 లక్షల టన్నులు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇక్కడ లభించే ముగ్గురాయిలో బేరియం కెమికల్స్ ఎక్కువగా ఉండంతో పౌడర్‌ను చైనా, అమెరికా, యూరోపియన్, గల్ఫ్ దేశాల్లో ఉన్న పెట్రోలియం బావుల్లో ఘర్షణ వాతావరణాన్ని నివారించేందుకు ఉపయోగిస్తున్నారు. దీంతో మంగంపేట ముగ్గురాయికి డిమాండ్ ఉంది. 1975-76 మధ్య కాలంలో ఓఎన్‌జీసీ (ఆయిల్ న్యాచురల్ గ్యాస్ సంస్థ) ద్వారా పెట్రోల్ బావులకు మంగంపేట బెరైటీస్ పౌడర్‌ను ఎగుమతులు చేశారు.



ఏ-గ్రేడు ముగ్గురాయి



బీ-గ్రేడు ముగ్గురాయి



సీ/డీ గ్రేడు ముగ్గురాయి

ముగ్గురాయి ధరలు టన్ను రూ.లలో

రకం	తొలిరోజుల్లో	ఇప్పుడు
ఏ-గ్రేడు	170	7,200
బీ-గ్రేడు	160	5,600
సీ/డీ గ్రేడ్లు	140	1780

పల్వరైజింగ్ మిల్లుల గతేంటి..?

ముగ్గురాయి గనులపై 160 పల్వరైజింగ్ మిల్లులు ఆధారపడి ఉన్నాయి. ముగ్గురాయి ముడి సరుకును పల్వరైజింగ్ మిల్లులకు ఇస్తారు. పల్వరైజింగ్ మిల్లులలో పౌడర్ చేసి డిమాండ్ ఉన్న దేశాలకు ఎగుమతులు చేస్తారు. మంగంపేట ముగ్గురాయి గనుల్లో రెండేళ్లకు [illegible] లేకుండా పోతుందన్న విషయం తెలియగానే మిల్లుల యజమానుల్లో ఆందోళన మొదలైంది.

వైసీపీ నిర్వాకంతో పదేళ్ల ముందే ఖాళీ

రెండేళ్లలో ముగ్గురాయిని వెలికితీసి అమ్ముకుని మూసేస్తారని అధికారులు చెబుతున్నారు. దీంతో ఏపీఎండీసీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. 81 మంది ఏపీఎండీసీలో పర్మినెంట్ ఉద్యోగులు, 511 మంది ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు. మంగంపేటలో పల్వరైజింగ్ మిల్లులతో వేలాది మంది కార్మికులు ఆధారపడి పనిచేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 15 ఏళ్లకు సరిపడ ఉన్న ముగ్గురాయిని ఐదేళ్లలో వెలికితీశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గనుల్లో రాయి లేకుండా ఖాళీ అయితే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మంగంపేట పరిస్థితి ఏంటని గ్రామస్థులు, కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు తదితరులు ఆందోళన చెందుతున్నారు.


మంగంపేటలో వెలసి ఉన్న పల్వరైజింగ్ మిల్లులు

ఒకటిన్నర ఏడాదికే రాయి ఖాళీ



మంగంపేట బెరైటీస్ గనుల్లో రెండేళ్లకు కాదు.. ఒకటిన్నర ఏడాదికే రాయి ఖాళీ అవుతుంది. ఈ విషయం తవ్వకాల్లో బయటపడింది. ఈ మేరకు యాజమాన్యానికి సమాచారం ఇచ్చాము. గనుల్లో ఉన్న రాయిని ప్రతిరోజూ వెలికితీసి డంప్ చేస్తున్నాము. ఉన్న రాయిని అమ్ముకోవడం తప్ప మరేమి చేయలేము. ఉద్యోగులు, కార్మికుల గురించి యాజమాన్యం ఆలోచిస్తుంది.

- కె.గోపీనాథ్, ఏపీఎండీసీ, మంగంపేట సీపీవో

ముగ్గురాయిని పల్వరైజింగ్ మిల్లులకు ఇవ్వండి



రాష్ట్ర, దేశ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముడి ఖనిజం ఎగుమతిని నియంత్రించేలా యాజమాన్యం నిర్ణయం తీసుకోవాలి. అలాగే పల్వరైజింగ్ మిల్లులకు సరిపడా ముడి ఖనిజాన్ని సరఫరా చేయాలి. మంగంపేట ముగ్గురాయి ఖాళీ అయిపోతుందంటే వేలాది మంది కార్మికులు రోడ్డున పడతారు.

- మాచినేని విశ్వేశ్వరనాయుడు, ముగ్గురాయి మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు, రైల్వేకోడూరు

నమ్మశక్యం కావడం లేదు



మంగంపేట బెరైటీస్ ఖాళీ అవుతుందంటే నమ్మశక్యంగా లేదు. కొన్ని వేల మెట్రిక్ టన్నుల ముగ్గురాయి నిక్షేపాలు గనుల్లో ఉన్నాయి. అధికారుల అనుమతితో గనులను కార్మిక సంఘాలతో కలసి పరిశీలిస్తాము. గనుల్లో రాయి ఖాళీ అయితే మాత్రం వేలాది కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయి.

- తుమ్మల రాధాక్రిష్ణయ్య,మంగంపేట ఏపీఎండీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు

---

8 నుంచి వైవీయూలో పీజీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎంఏ, ఎంకామ్, ఎంఎస్‌సీ) కోర్సులలో నేరుగా ప్రవేశాలు ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఎంట్రెన్స్ టెస్ట్-2025 రాసి అర్హత సాధించిన వారు, రాయని వారు కూడా ఈ స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావచ్చన్నారు. తెలుగు 40, ఇంగ్లీష్ 38, పొలిటికల్ సైన్స్ 30, బయోకెమిస్ట్రీ 24, కామర్స్ 38, ఎకనామిక్స్ 4, సైకాలజి 30, జియాలజీ 28, ఫిజిక్స్ 34, మ్యాథమేటిక్స్ 33, జువాలజీ 11, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ 32, బోటనీ 16, జెనిటిక్స్ 26, ఫిజికల్ ఎడ్యుకేషన్ 43, మైక్రో బయాలజీ 6, కెమిస్ట్రీ 11, బయోటెక్నాలజీ 1, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ 33, సిస్టర్ 32, కంప్యూటర్ సైన్స్ 12, ఫుడ్ టెక్నాలజీ 5, జర్నలిజం 33, కాంపుటూషనల్ డేటాసైన్స్ 33, జెరోణ ఉర్దూ 21 సీట్లు సబ్జెక్టుల వారీగా ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలను, నిర్ణీత ఫీజుతో విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ప్రాంగణంలో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. వివరాలకు వైవీయు.ఇడియు.ఇన్‌ను సంప్రదించాలన్నారు.

11న ముద్దనూరు ఎంపీపీ ఎన్నిక

ముద్దనూరు డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ ముద్దనూరు ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాధాకృష్ణవేణి తెలిపారు. శెట్టివారిపల్లె ఎంపీటీసీగా ఎన్నికైన కుడుముల ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఎంపీపీగా కొనసాగుతూ వచ్చారు. మండల సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరైన కారణంగా ఆయనను ఎంపీపీ, ఎంపీటీసీ పదవి నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో 11వ తేదీ ఉదయం ఎలక్షన్ ఆఫీసర్, జమ్మలమడుగు ఆర్డీవో ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహి స్తామన్నారు. 10 మంది ఎంపీటీసీలకు 9మంది ఎన్నికలో పాల్గొని ఎంపీపీని ఎన్నుకుంటారని తెలిపారు.

గిట్టుబాటు ధరలపై రభస

- జగన్‌కు రైతులపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రమ్మనండి
- కూటమిది రైతు ప్రభుత్వం
- అన్ని పంటలకు గిట్టుబాటు ధర
- సభలో ఏకగ్రీవ తీర్మానం
- ఒంటిమిట్టను కడపలోనే కొనసాగించాలని డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, పక్కన కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గరం గరంగా కొనసాగింది. పంటలకు గిట్టుబాటు ధరలపై వైసీపీ, కూటమి నేతల మధ్య మాటల యుద్ధంతో రభసగా మారింది. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ రామగోవింద్‌రెడ్డి అధ్యక్షతన 40 నిమిషాలు ఆలస్యంగా 10-40కి సమావేశం ప్రారంభమైంది. మొదట రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం సభ ప్రారంభమైన కొద్దిసేపట్లోకి పంటలకు గిట్టుబాటు ధరలపై టీడీపీ వైసీపీ సభ్యుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. ఉల్లి, చీనీ, మామిడి, అరటి తదితర పంటల ధరపై దుమారం రేగింది. వైసీపీ ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, ఎంపీపీలు, జడ్పీటీసీలు వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తావనను పదేపదే తీసుకువచ్చారు. దీంతో టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్‌లు ఎదురుదాడికి దిగారు. రైతుల గురించి మీరా మాట్లాడేది... మీ ప్రభుత్వంలో వ్యవసాయరంగాన్ని సర్వనాశనం చేశారు... మా కూటమి ప్రభుత్వం వ్యవసాయరంగానికి పూర్వవైభం తెస్తోంది. సీఎం చంద్రబాబు నిత్యం రైతులతో మమేకమై వారి కష్ట, నష్టాలను తెలుసుకొని బాసటగా నిలుస్తున్నారు. ఉల్లి, మామిడి, చీనీ, అరటి ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ధరలు తగ్గాయి. వీటి గురించి జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడితే ఎలాంటి ప్రయోజనం ఉండదని.. మీ జగన్‌మోహన్‌రెడ్డికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడమనండి.. అంటూ ధ్వజమెత్తారు. తమది రైతు ప్రభుత్వమని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు.

జిల్లా రైతులకు శుభతరుణమే - కలెక్టర్

ఈ ఏడాది రైతులకు శుభతరుణమేనని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరు అన్నారు. ఆశించిన స్థాయిలో వర్షాలు పడడంతో జలాశయాల్లో 89 టీఎంసీలకు 83 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. భూగర్భజలాలు కూడా 8 మీటర్ల మేర పెరిగాయన్నారు. మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా అధికంగా పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు సబ్సిడీపై సూక్ష్మ సేద్య పరికరాలను అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో కేవలం ఎగుమతులకు మాత్రమే ఉపయోగపడే కేపీ ఉల్లిరకం పంటను ఈసారి అధికంగా పండించారన్నారు. బంగ్లాదేశ్, సౌత్‌ఈస్ట్ దేశాలకు ఎగుమతుల సమస్య కారణంగా ధరలు లేక రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని 14వేల ఎకరాల ఉల్లి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని అందించేందుకు చర్యలు చేట్టిందన్నారు. అరటి పంట కూడా మరో నెలలో దిగుబడి అందే అవకాశం ఉందని, వారం రోజుల పాటు ట్రేడర్స్ ద్వారా కోనుగోలు చేయనున్నామని తెలిపారు.

సమస్యలకు పరిష్కారం చూపాలి - ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గత సమావేశంలో ఏ సమస్యలను ఆడిగారో ఇప్పు డు అవే సమస్యలను అడుగుతున్నారని వాటికి పరిష్కారం మాత్రం చూపడం లేదన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో ఆరోగ్య సిబ్బంది సరైన సమయానికి విధులకు హాజ రు కావడం లేదన్నారు. అన్ని వేళలా స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.


కుక్కల దాడి నుంచి ప్రజలను కాపాడాలి - ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డిలు

గ్రామాలలో కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. కుక్కకాటుతో పలువురు చనిపోతున్నారన్నారని.. దూడలను, మేకలను కూడా చంపేస్తున్నాయని తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతున్నారని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

- సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కోరారు. వైద్యసిబ్బంది కొరతతో ప్రజలకు సక్రమంగా వైద్యం అందడం లేదన్నారు.
- సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను కడప జిల్లాలోనే కొనసాగించాలని ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు ముద్దుకృష్ణారెడ్డి పేర్కొన్నారు. లేకుంటే రాజంపేటను జిల్లా కేంద్రంగా ఆధికారంగా ప్రకటించాలని కోరారు.
- పుల్లంపేట మండలంలో 400 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఎంపీపీ బాబుల్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఒకే వ్యక్తి 40 ఎకరాలు ఆక్రమిస్తే తహసీల్దార్ ఎలాంటి చర్యలను తీసుకోలేదని ఆరోపించారు.
- వికలాంగుల పింఛన్ల తప్పుడుసర్టిఫికెట్కు సంబంధిత డాక్టర్లు బ్రోకర్ల ద్వారా రూ.30 నుంచి 35 వేల వరకు తీసుకుంటున్నారని చర్యలు తీసుకోవాలని వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవిరెడ్డి కోరారు.
- ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి సభదృష్టికి తీసుకు వచ్చారు.
- చీనీ, మామిడి, ఉల్లి, అరటి పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు డీలా పడ్డారని వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వీరపునాయునిపల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి సభ దృష్టికి తెచ్చారు.
- గ్రామీణ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని జడ్పీ వైస్‌చైర్మన్ పిట్టుబాలయ్య యాదవ్, కమలాపురం జడ్పీటీసీ సుమిత్రాదేవిలు పేర్కొన్నారు.
- పులివెందుల జడ్పీటీసీ సభ్యులారాలు మారెడ్డి లతారెడ్డి మాట్లాడుతూ నల్లపురెడ్డిపల్లె ఆసుపత్రిలో హెల్పర్లను ఏర్పాటు చేయాలన్నారు.

తీర్మాణాలు

గిట్టుబాటు ధర లేక నష్టపోయిన ఉల్లి, అరటి రైతులను ఆదుకునేందుకు, జిల్లాలోని ఆరో గ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న వివిధ రకాల పోస్టులను భర్తీ చేసేందుకు, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప జిల్లాలోనే కొనసాగించాలనే మెజార్టీ సభ్యుల ప్రతిపాదనను సర్వసభ్య సమావేశం ఆమోదిస్తూ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జడ్పీ సీఈవో సి. ఓబులమ్మ, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మంచుపొద్దున పొలానికి మందు పిచికారి చేస్తున్న రైతు

కప్పేసిన పొగమంచు..

దువ్వూరు/ రాజుపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను కారణంగా గత నెల రోజులు జిల్లాలో వర్షాలు కరిశాయి. శుక్రవారం నుంచి కాస్త తెరిపి ఇచ్చింది. అయితే శనివారం ఉదయం తెల్లని మేఘాల రూపంలో మంచు కురిసింది. దువ్వూరు, రాజుపాలెం మండ లంలోని పంట పొలాలను దుప్పిటిలా కప్పేసింది. తెల్లవారి బారెడు పొద్దెక్కినా భానుడిజాడ కనిపించలేదు. దీంతో పసుపు, వరి, ఇతర పంటలపై మంచు బిందువులు జాలు వారాయి. అదే సమయంలో రోడ్ల వెంబడి ప్రయాణించే వాహన చోదకులు మబ్బుల మాటన అగచాట్లు పడ్డారు. కాగా, పొగమంచు ఎండు దశలో ఉన్న పంటలపై ప్రభా వం చూపుతుందని రైతులు చర్చించుకుంటున్నారు.


మంచుతో వాహన చోదకుల ఇక్కట్లు


బారెడు పొద్దెక్కినా.. పొగ మంచు

హోంగార్డుల సేవలు అభినందనీయం


హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

కడప క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డుల సేవలు అభినందనీయమని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ కొనియా డారు. హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో శనివారం నిర్వహించిన వేడుకలకు ఎస్పీ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంగార్డుల పరేడ్‌ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ హోంగార్డుల వ్యవస్థ పోలీసు బలగాలకు సహాయకారిగా, ఒక బలంలా ఆవిర్భవించిందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్, నేర దర్యాప్తు, కంప్యూటరు విధుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. హోంగార్డుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్ బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య మాట్లా డారు. అనంతరం విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు, క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహు మతులు, ప్రశంసాపత్రాల అందించారు. పరేడ్ అనంతరం గ్రౌండు నుంచి హోంగార్డుల ర్యాలీని జెండా ఊపి ప్రారం భించారు. ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, కడప డీఎస్పీ వెంక టేశ్వర్లు, డీపీవో ఏవో కేవీ రమణ, వైద్యులు డాక్టర్ రేష్మ, ఆర్ఐలు, సీఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు. కాగా, పదవీ విరమణ పొందిన హోంగార్డు ఎస్.వెంకటసుబ్బయ్యకు జిల్లాలోని హోంగార్డులు స్వచ్ఛందంగా విరాళంగా ఇచ్చిన రూ.4,12,510 చెక్కును ఎస్పీ అందజేశారు.

చెన్నూరు బీఎల్వోలపై డీఆర్వో ఆగ్రహం 7

అంత్యక్రియలు నిర్వహించకుండా ఘర్షణ 7

7 టీడీపీలో భగ్గుమన్న విభేదాలు
- ఇరువర్గాల ఘర్షణ

సీఎం రమేశ్‌కు నేతల పరామర్శ


సీఎం రమేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న పురందేశ్వరి

ఎర్రగుంట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తల్లి రత్నమ్మ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. శనివారం పోట్లదుర్తికి రాజ మండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, వైజాగ్ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మెగా కంపెనీ అధినేతలు క్రిష్ణారెడ్డి, పివిరెడ్డిలు వచ్చి సీఎం రమేశ్ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రమేష్‌ను, ఆయన తండ్రి మునిస్వామినాయుడు, సోదరులు సీఎం సురేష్, సీఎంరాజేష్‌లను పరామర్శిం చారు. రత్నమ్మ మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, నాగులపల్లి చంద్ర ఓబుళరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, నాయకులు, తదితరులు పరామర్శించారు.


నివాళులు అర్పిస్తున్న మెగా క్రిష్ణారెడ్డి తదితరులు

పీలేరులో కోర్టు భవనాల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

● రూ.23.70 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు

● ఫలించిన నల్లారి సోదరుల కృషి

పీలేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా పీలేరు ప్రజలను ఊరిస్తున్న కోర్టు నూతన భవనాల నిర్మాణాల కోసం కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పీలేరులో నాలుగు కోర్టుల సముదాయాలు నిర్మించేందుకు రూ.23.70 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ఈనెల 4వ తేదీ (గురువారం) రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇంతకాలంగా అనిశ్చితిలో ఉన్న నూతన భవనాల నిర్మాణం వేగవంతం కానుంది.





పీలేరులో ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం, కొత్త భవనాలు నిర్మించనున్న చెన్నకేశవ స్వామి ఆలయ భూములు

2013లో మంజూరు, ఆపై అడ్డంకులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీలేరు, కేవీ పల్లె, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి, రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, సదుం మండలాలు పీలేరు కోర్టుల పరిధిలోకి వస్తాయి. పీలేరులో ప్రస్తుతం 11వ అదనపు జిల్లా జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులు ఉన్నాయి. వీటిలో 11వ అదనపు జిల్లా జడ్జి న్యాయస్థానాన్ని నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేశారు.

సాధారణంగా మునిసిపల్ ప్రాంతాలకు మాత్రమే మంజూరు చేసే జిల్లా కోర్టును ఆయన స్వయంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో మాట్లాడి పంచాయతీ కేంద్రమైన పీలేరులో ఏర్పాటు చేయించారు. ఆ సమయంలోనే పీలేరు కోర్టులకు నూతన భవనాలు నిర్మించాలన్న ప్రతిపాదన ముందుకు రాగా ఆయన స్థల సేకరణ, నూతన భవనాల నిర్మాణానికి అంగీకరించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఆయన చొరవతో మదనపల్లె మార్గంలోని ఈద్గా మైదానానికి ఆనుకుని ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయ మాన్య భూములకు పరిహారం చెల్లించి కోర్టుల సముదాయం నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఆయన పదవీ కాలంలో పరిహారం విడుదల ఆలస్యం కావడంతో ఆ పనులకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. ఆ తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో స్థానిక న్యాయవాదుల కృషి ఫలితంగా ఆలయ భూములకు రూ.3 కోట్ల మేర రెండు విడతలుగా పరిహారం మంజూరైంది కానీ నూతన భవనాల కోసం నిధులు మంజూరు కాకపోవడంతో భవనాల నిర్మాణంపై అనిశ్చితి నెలకొంది.

ఎమ్మెల్యే, బార్ అసోసియేషన్ కృషితో కదలిక

2024 ఎన్నికల సమయంలో స్థానిక న్యాయవాదులు నూతన భవనాల అంశం నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే అందుకు సంబంధించిన చర్యలు చేపడతామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆ మేరకు కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీసీ పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వారికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సహకారం లభించి నూతన భవనాల అంశం ప్రభుత్వ పెద్దలు దృష్టికి తీసుకెళ్లారు. వారి కృషి ఫలించి ప్రభుత్వం పీలేరులో నాలుగు కోర్టుల సముదాయాల నిర్మాణానికి రూ.23.70 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కోర్టుల సముదాయం కోసం రూ.31 కోట్లు అవసరమని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపారని, తొలి విడతగా ప్రభుత్వం రూ.23.70 కోట్లకు అంగీకరించిందని, మిగిలిన నిధులను కూడా సాధిస్తామన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ నిధుల మంజూరు ఇక కేవలం లాంఛనమేనని, త్వరలోనే నిర్మాణ పనులు కార్యరూపం దాల్చుతాయని తెలిపారు. కోర్టుల భవనాలకు నిధుల మంజూరు నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో పీలేరుకు అంతా మంచే జరుగుతోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. మొన్న పీలేరును గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మార్చేందుకు అంగీకారం, నిన్న రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటన, నేడు పీలేరులోని కోర్టులకు నూతన భవనాల నిర్మాణానికి నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్‌తో ఇక పీలేరు అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పోలి చెరువు వద్ద చమర్తి జలహారతి



జలహారతి ఇస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో అతి పెద్దచెరువు పోలి చెరువు పూర్తిగా నిండడంతో టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్‌రాజు శనివారం జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో ప్రస్తుత వర్షాల వల్ల అన్ని చెరువులు నిండడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌నాయుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్‌నాయుడు, పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై మచ్చుకత్తితో దాడి



గాయపడిన గంగరాజు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో మాట్లాడుతున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తి మచ్చుకత్తితో దాడి చేసి గాయపరిచాడని ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. ఆయన కథనం మేరకు గంగరాజు అనే వ్యక్తి ప్రతిరోజూ తన చెల్లెలి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకొచ్చి వదిలేవాడు. శనివారం యథావిధిగా అక్కడికి వచ్చిన గంగరాజును అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ఉన్న ఇంట్లో అద్దెకు నివసిస్తున్న సురేశ్ సెల్‌ఫోన్ ఇమ్మని అడిగాడు. అందుకు అతను తిరస్కరించడంతో ఇద్దరూ గొడవపడ్డారు. తన భార్యతో రోజూ మాట్లాడుతున్నావని ఆరోపిస్తూ మచ్చుకత్తితో సురేశ్ దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన గంగరాజును చుట్టుపక్కలవారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. సురేశ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మద్యం దుకాణంలో చోరీ

కురబలకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగళ్లులో శుక్రవారం రాత్రి అంగళ్లులోని కదిరి రోడ్డులో మద్యం దుకాణంలో చోరీ జరిగింది. రూ.45 వేల నగదు, మద్యం బాటిళ్లను దొంగిలించుకెళ్లారు. షాపుపై ఉన్న రేకులను కట్ చేసి షాపులోకి ప్రవేశించి చోరీ చేశారు. శనివారం ఉదయం షాపులో చోరీకి గురైన విషయాన్ని దుకాణదారులు చూసి యజమానికి తెలియజేశారు. దీంతో దుకాణయజమాని రుద్ర బాలకృష్ణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు విచారించారు. ఒక షాపులో చోరీకి పాల్పడిన సంఘటన సీసీ కెమెరాలో నమోదైంది. కాగా ఒక యువకుడు చోరీ చేసినట్లు తెలుస్తోంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని వైద్య ఆరోగ్య శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అందించే వైద్య సేవలు, ఐఎంఆర్, ఎంఎంఆర్ ప్రమాణాలు, వివిధ రకాల వైద్య పరీక్షలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించే రక్త పరీక్షల్లో కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో గర్భవతుల హిమోగ్లోబిన్ శాతం తక్కువగా నమోదు అవుతోందని, దీనిపై ఆరోగ్య అధికారులు దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో సమన్వయం చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఐఎంఆర్, ఎంఎంఆర్‌లు నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవడం లేదని, సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్‌ఎంలు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన మరణాలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, గురుకులాలు, కస్తూరి బా పాఠశాలల్లో ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్‌ఎంలు తరచుగా పరీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

నిందితులపై కేసు నమోదు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్‌పై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు తమిళనాడు రాష్ట్రం గుడియాతానికి చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ అంజాద్ ఝార్ఖండ్ నుంచి మదనపల్లె మార్కెట్ యార్డుకు సరుకు లోడును గురువారం రాత్రి తీసుకొచ్చారు. మదనపల్లెకు చెందిన పీఎం ట్రేడర్స్ మసూద్ కిరాయి ఇవ్వక పోవడంతో కిరాయి కోసం నిలదీశాడు. దీంతో మండి యాజమాని, మరో ఐదుగురు లారీ డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచారు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలతో కలిసి 50 మందికిపైగా శనివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. వీరంతా గుమికూడి ఉండగా టూటౌన్ సీఐ రాజారెడ్డి రాష్ట్రీయ చాలక్ ఏకతా మబ్ లారీ వర్కర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్దార్ హుసేన్‌ను కొట్టి లాక్కుపోయి లోపల కూర్చోబెట్టాడు. దీంతో అసోసియేషన్ చైర్మన్ అబూబ్‌షేక్ ఆధ్వర్యంలో సీఐ రాజారెడ్డిపై మదనపల్లె డీఎస్పీ మహేంద్రకు, ఎస్పీ ధీరజ్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు. కాగా డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య



కీర్తిరెడ్డి మృతదేహం

రాజంపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న కనపర్తి కీర్తిరెడ్డి (21)అనే యువతి శనివారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మన్నూరు పోలీసులు అందించిన సమాచారం ప్రకారం... నందలూరు గ్రామానికి చెందిన కీర్తిరెడ్డి తండ్రి ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లగా, ఆమె తల్లి అన్నమాచార్య యూనివర్సిటీకి సమీపంలోని బోయనపల్లెలో నివాసముంటూ కూతురిని చదివించుకుంటోంది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం బెడ్ రూంలోకి వెళ్లిన కీర్తి రెడ్డి ఎంతసేపటికీ తలుపులు తెరవకపోవడంతో అనుమానించిన తల్లి తలుపులు తెరవగా కూతురు ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో ఆమెను కిందకు దించి రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె మృతికి కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

● ఏడీఏ రమణారావు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ రమణారావు

బి.కొత్తకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, క్రిమి సంహారక మందులను అధిక ధరలకు అమ్మినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ పీలేరు ఏడీఏ రమణారావు దుకాణదారులను హెచ్చరించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా శనివారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ నిషేధిత మందులు, ఎరువులు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదన్నారు.

ప్రతి దుకాణంలోనూ అమ్మకాలు, కొనుగోళ్లు, ప్రస్తుతం ఆయా దుకాణాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందుల నిల్వల వివరాలు రికార్డులు, బోర్డుల్లో కనపరచాలని, విక్రయించిన మందులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. వ్యాపారులు మోసం చేస్తే ఆధారాలతో తమకు ఫిర్యాదు చేయాలని రైతులకు తెలిపారు. రైతన్నా..మీ కోసం ద్వారా రైతులు అవగాహన పొంది, ఆరుతడి పంటలు, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు.

పట్టపగలే వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కలికిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెబుతూ వృద్ధురాలు చదివే అరుణకుమారి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కుపోయిన సంఘటన శనివారం కలికిరిలో జరిగింది. పట్టణంలోని చదివే వాండ్లపల్లెలో పీలేరు రోడ్డులో చదివే నరసింహారెడ్డి భార్య అరుణకుమారి ఒంటరిగా నివసిస్తోంది. పిల్లలు బయట ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి అరుణకుమారి ఇంటి వద్దకు వచ్చి ఇల్లు బాడుగకు ఇస్తావా అని అడిగాడు. అలా అడుగుతూనే ఇంటి లోపలికి దూసుకెళ్లి అరుణకుమారి మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. దొంగిలించిన గొలుసు బరువు 36 గ్రాములుగా పేర్కొంటూ ఈ మేరకు అరుణకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన సీఐ రామచంద్ర, ఎస్‌ఐ రమణ పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అనుమానితుడి ఫొటోలు లభ్యమైనట్లు సమాచారం.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి సస్పెన్షన్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గాలివీడు, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): తూముకుంట పంచాయతీ కస్బాలో మసీదు నిధులను కాజేసిన తూముకుంట ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.పాపాసాహెబ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మసీదు అభివృద్ధి కోసం వక్ఫ్ బోర్డు నుంచి విడుదలైన రూ.12 లక్షలు, దాతల నుంచి సేకరించిన మరికొంత సొమ్మును తన స్వంతానికి వాడుకున్నాడని గ్రామ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేశామన్నారు. విచారణలో మసీదు నిధులు వాడుకున్నాడని నిర్ధారణ జరిగిందని, వాటిని తిరిగి చెల్లించమని రెండుసార్లు హెచ్చరించినా ఆయన పట్టించుకోలేదన్నారు. ప్రజలకు, పార్టీకి చెడ్డ పేరు తెస్తున్న విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, శ్రీనివాస రాజు, భద్రత నాయుడు, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యులు మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పీలేరులో అట్టహాసంగా ఐక్యతా ర్యాలీ



యూనిటీ మార్చ్‌లో అధికారులు

పీలేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శనివారం పీలేరులో యూనిటీ మార్చ్ (ఐక్యతా ర్యాలీ) అట్టహాసంగా జరిగింది. కడప జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ దేశ ప్రథమ హోం మంత్రిగా పనిచేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలోని సంస్థానాలన్నింటినీ ఐక్యం చేసి దేశ సమగ్రతను కాపాడారన్నారు. ఆయన జీవితం, ఆశయాల గురించి యువతకు తెలియజేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆయన జయంతిని దేశవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా రాయచోటి, పీలేరు పట్టణాల్లో ఐక్యతా ర్యాలీ నిర్వహించామన్నారు. పీలేరు పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకర్, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర రెడ్డి, ఈఓ బ్రహ్మానంద రెడ్డి, బీజేపీ నేతలు వెంకటరమణ, పురుషోత్తం, స్థానిక నిర్వాహకులు పీవీఎస్ లక్ష్మి, రాయల సుధాకర్, జాతీయ యువ కార్యకర్తలు వెంకటేశ్, నాగరాజు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో ఆటో దహనం



మంటల్లో కాలిపోయిన ఆటో

వాల్మీకిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణ పడి ఆటో దహనం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు వ్యక్తులు తమకు ఉన్న పాత కక్షల నేపథ్యంలో గాంధీ బస్టాండ్ ప్రాంతంలో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఓ వర్గానికి చెందిన వ్యక్తి ఆటోకు మరొకరు నిప్పు పెట్టారు. ఆటో తగలబడిపోతుండడంతో స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. బస్టాండ్ ప్రాంతంలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడం ఎస్‌ఐ చంద్రశేఖర్ సిబ్బందితో వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గీయులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు నుంచి పడి మహిళకు గాయాలు



గాయపడ్డ భాగ్యమ్మ

ములకలచెరువు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు నుంచి పడి మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువు వాసి భాగ్యమ్మ పనుల నిమిత్తం సత్యసాయి జిల్లా నల్లచెరువుకు వెళ్లేందుకు బస్టాండు సర్కిల్‌కు వచ్చింది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు రావడంతో ఎక్కుతుండగా డ్రైవర్ ముందుకు కదిలించాడు. దీంతో మహిళ కిందపడి తీవ్రంగా గాయపడింది. మహిళ కిందపడిపోయినా డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి వెళ్లిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడే ఉన్న ఆటోడ్రైవర్లు మహిళను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ముందు మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే ప్రభుత్వం సరిహద్దు గ్రామాలకు పథకం వర్తింపజేయడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా మండలంలోని కర్ణాటక సరిహద్దు గ్రామాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నిలిపేయడంతో మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం బి.కొత్తకోట నుంచి చేలూరుకు వయా కందుకూరు, కమ్మచెరువు మీదుగా చేలూరుకు వెళ్లే పలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నిలిపేశారని పలువురు కందుకూరు మహిళలు కందుకూరులో ఆర్టీసీ బస్సును నిలిపి నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం లేకపోవడంతో సరిహద్దు గ్రామాల్లో ఉన్న మాకు తీవ్ర నష్టం జరుగుతోందని, సంబంధిత అధికారులు స్పందించి సరిహద్దు గ్రామాలకు ఉచిత ప్రయాణాన్ని కొనసాగించి మాకు న్యాయం చేయాలని మహిళలు కోరుతున్నారు.

రాజంపేటలో ఉద్యమం ఉధృతం

● విద్యార్థుల భారీ ర్యాలీ.. పెన్షనర్ల ఆందోళన



రాజంపేటలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

రాజంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ చేస్తున్న ఆందోళన రోజురోజుకు ఉధృతమవుతోంది. శనివారం రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ అనంతరం పాతబస్టాండులో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ జనసేన నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, మైనార్టీ నాయకులు అబూబకర్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మెట శివప్రసాద్ తదితరులు మాట్లాడుతూ రాజంపేటను జిల్లా చేసేంతవరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.



రాజంపేటలో ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

పెన్షనర్ల నిరసన ప్రదర్శన

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ స్థానిక ఎన్జీవో భవనం సమీపంలో పెన్షనర్లు ఆందోళన చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, కేడీ వరప్రసాద్, జేఏసీ నాయకులు వర్దిబోయిన సుధాకర్‌బాబు, నీలి ఈశ్వరయ్య, చిట్వేలి రవికుమార్, హరీష్, అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు, జేఏసీ నాయకుడు అబ్బూరు ప్రభాకర్‌నాయుడు, అల్లం సుబ్రమణ్యం మాట్లాడుతూ రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో విద్యార్థులు, మైనార్టీలు, అన్నివర్గాల ప్రజలు ఉద్యమంలో పాల్గొంటున్నారని వారి ఆకాంక్షలకు అనుగుణంగా రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేశారు.

రిలేదీక్షలు

రాజంపేట ఆర్‌అండ్‌బీ బంగ్లా ఎదుట మున్సిపల్ వైస్‌చైర్మన్ మర్రి రవి ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభించారు. జిల్లా కేంద్రం ప్రకటించేవరకు ఆమరణదీక్ష చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కువైట్‌లో ఎన్‌ఆర్‌ఐల నిరసన

కువైట్‌లో ఎన్‌ఆర్‌ఐలు నిరసన ప్రదర్శన చేశారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని నినాదాలు చేశారు. ఈ మేరకు కువైట్‌లోని భారతీయ రాయబార కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

● ఇరువర్గాల ఘర్షణ

కడప, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల విషయమై టీడీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. చక్రాయపేట మండలంలోని కె.రాచపల్లె సమీపాన రోడ్డు పనుల కోసం ఇరువర్గాలు సిగపట్లు పట్టారు. మండల ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి వర్గం, మరో వైపు కర్నాటి భరత్‌రెడ్డి, కర్నాటి అమర్‌నాథ్‌రెడ్డి వర్గానికి చెందిన వారు పెద్ద ఎత్తున మోహరించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని సద్దుమణిచారు. ఆ వివరాల్లోకి వెళితే.. రాచపల్లె గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద నుంచి పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణ కాంట్రాక్టు పనులను కర్నాటి మురళీధర్‌రెడ్డి దక్కించుకున్నారు. ఈ పనులు చేపట్టేందుకు అక్కడకు వెళ్లగా.. మహేశ్వర్‌రెడ్డి అనుచరులైన శ్రీరామ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి అక్కడకు చేరుకొని ముందుగా పనుల కోసం తాము ప్రయత్నించామంటూ అడ్డుకున్నారు. అదే సమయంలో కర్నాటి భరత్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి తమ అనుచరులతో భారీ ఎత్తున అక్కడకి చేరారు. దీంతో ఇరువర్గాల వారు వాగ్వాదానికి దిగడంతో స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో కొందరికి సల్పగాయాలయ్యాయి. అంతలో పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాలకు నచ్చజెప్పినప్పటికీ ససేమిరా అని భీష్మించడంతో సీఐ జోక్యం చేసుకొని బెటాలియన్‌ను దింపి ఇరువర్గాలను చెదరగొట్టి అక్కడ నుంచి పంపారు. ప్రస్తుతం పరిస్థితి సద్దుమణిగినప్పటికీ ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. ఈ సంఘటనతో టీడీపీలో మాత్రం వర్గ విబేధాలు భగ్గుమన్నాయి.

అభ్యంతరాలను 30లోగా తెలపాలి

కడప కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల మెరిట్ జాబితా అధికారిక వెబ్‌సైట్‌లో ఉందని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా kadapa.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉందని, అభ్యతరాలుంటే ఈనెల 30వ తేదీలోగా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సాయంత్రం 5గంటల లోపు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ఆ ప్రకటనలో తెలిపారు.

క్వాంటమ్ కోర్ కాన్సెప్ట్‌పై అవగాహన

వేంపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో నాలుగు రోజులుగా జరుగుతున్న క్వాంటమ్ శిక్షణ సమావేశంలో శనివారం క్వాంటమ్ కంప్యూటింగ్ కాన్సెప్ట్‌పై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన సీడాక్ కంపెనీ ప్రతినిధి అభిజిత్ తేజ్ విద్యార్థులకు క్వాంటమ్ కంప్యూటింగ్ వివరాలు తెలిపారు. గ్రోవర్ అల్గరిథమ్, డయాస్ అల్గరిథమ్, క్వాంటమ్ సర్క్యూట్ తయారీపై వివరించారు. ఈ సందర్భంగా అభిజిత్ తేజ్‌ను డైరెక్టర్ గుప్తా, ఏవో రవికుమార్ ఇతర అధికారులు సత్కరించారు.

అధికార లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు

కలసపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికార లాంఛనాలతో శనివారం 11వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ (డీఎస్పీ) కందుల వెంకటరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం అనారోగ్యంతో ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. స్వగ్రామమైన అక్కివారిపల్లెలో శనివారం సాయంత్రం పోలీసుల లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ సెల్ అడిషనల్ కమాండెంట్ కె.సాంబయ్య, 11వ బెటాలియన్ కమాండెంట్ పీఎన్‌డీ ప్రసాద్, ఆర్ఐ కె.నాగరాజు, ఆర్ఎస్ఐ డీవీ సుబ్బారావు, ఏఆర్ఎస్ఐ టీఈ రమణ, పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి, కలసపాడు పోలీసులు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

కడప క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలో మానసిక పరిస్థితి సరిగాలేని వ్యక్తి నీటికుంటలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... ప్రొద్దుటూరు పట్టణం కల్లూరు గ్రామానికి చెందిన సుమంత్(29) మతిస్థిమితం(మానసికపరిస్థితి) సరిగ్గా లేకపోవడంతో వైద్య పరీక్షల నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకొచ్చారు. అదేరోజు హాస్పిటల్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. శనివారం రిమ్స్ సమీపంలో సుమంత్ మృతదేహాన్ని గుర్తించామని, మృతుడి భార్య సుష్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు.

ప్రత్యామ్నాయంపై మక్కువ..

● కొత్త పంటల వైపు రైతుల చూపు ● విస్తరిస్తున్న డ్రాగన్ ఫ్రూట్స్, ఆయిల్‌ఫామ్, వెదురు, అవకాడో


ఓబులవారిపల్లె మండలంలో సాగులో ఉన్న డ్రాగన్‌ఫ్రూట్

ఓబులవారిపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో వ్యవసాయమే జీవనాధారంగా రైతులు జీవనం సాగిస్తున్నారు. మామిడి, అరటి, బొప్పాయ పంటలతో పచ్చగా కళకళలాడుతూ ఉన్న ఈ నియోజకవర్గాన్ని రెండో కోనసీమగా అభివర్ణిస్తారు. భూగర్భజలాలు అంతంత మాత్రమే అయినా.. గల్ఫ్‌దేశాలకు వెళ్లి సంపాదించుకున్న రూపాయలను ఖర్చు పెట్టి ఉన్న భూములను సాగులోకి తీసుకువస్తుంటారు. ప్రస్తుతం వాణిజ్య పంటలకు అంత డిమాండ్ లేకపోవడంతో ఉన్న పంటలకు మంగళహారతి పట్టేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. వీటిల్లో ముఖ్యంగా డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆయిల్‌ఫామ్, వెదురు తోటలను సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సబ్సిడీతో ప్రోత్సహించడంతో వీటి విస్తీర్ణం యేటా పెరుగుతోంది. అంతేకాకుండా ఉపాధి హామీ పథకంలో నూతన పంటలకు ప్రోత్సాహకాలిస్తుండటంతో రైతులు మరింత ఆసక్తి చూపుతున్నారు.

డ్రాగన్‌ఫ్రూట్

డ్రాగన్‌ఫ్రూట్ సాగు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉన్న పంటగా చెబుతున్నారు. ఒకటిన్నర మీటర్ల దూరం స్తంభాలు, ట్రెల్లీస్ పద్ధతిలో సాగు చేయవచ్చు. ఇది ఉష్ణ మండలాల


బొజ్జావారిపల్లె పంచాయతీలో అవకాడో పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారితో రైతు

పండు. మూడో సంవత్సరం నుంచి దిగుబడి వస్తుంది. డ్రాగ న్ పువ్వు వచ్చిన 25 నుంచి 30 రోజుల్లో పండుగా మారుతుంది. ఇందులో మంచి పోషకాలు, విటమిన్‌లు, ఖనిజాలు ఉంటాయని వైద్యులు సైతం సూచించారు. ఇది సుమారు వందలాది ఎకరాల్లో సాగులోకి వస్తున్నది.

ఆయిల్‌ఫామ్

ఈ పంట సాగు సుమారు వందల ఎకరాల్లో నమోదవుతున్నది. యేటా సాగును పెంచడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీర్ఘకాలికంగా మంచి ఆదాయాన్ని ఇచ్చే పంటగా చెబుతున్నారు. వరి, పత్తి పంటల కంటే తక్కువ ఖర్చు, ఎక్కువ ఆదాయం. ఇది 20 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. ఆయిల్‌ఫామ్ సాగును మే, జూన్ నెలల్లో ప్రారంభిస్తారు. ఎటు చూసినా మొక్కకు మొక్కకు 9 మీటర్ల దూరంతో నాటుకోవాలి. హెక్టారుకు 140 మొక్కల వరకు పెంచుకోవచ్చు. మూడు సంవత్సరాల వరకు మొక్కకు నీరు ఎక్కువగా పెట్టాలి. రెండున్నర నుంచి మూడు సంవత్సరాల లోపు దిగుబడి మొదలవుతుంది. ఇది 30 నుంచి 40 సంవత్సరాల వరకు దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే పంటగా అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతులు మామిడి పంటను తీసివేసి ఆయిల్ ఫామ్ సాగుకు సిద్ధమవుతున్నారు.

వెదురు

ఈ వెదురు పంటను ఆకుపచ్చ బంగారంగా అభివృద్ధి చేస్తారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ మిషన్ ప్రాజెక్టు కింద ప్రత్యేకంగా వెదురు సాగును ప్రోత్సహిస్తూ రాయితీలు అందిస్తున్నారు. బీడు భూముల్లో వెదురు సాగు చేస్తే మంచి ఆదాయం ఇచ్చే అవకాశం ఉంటుందని గ్రామీణ పేదలను ప్రోత్సహిస్తున్నారు. భవిష్యత్‌లో మంచి ఆదాయం వస్తుందని, డ్వాక్రా సంఘాల మహిళలను కూడా ప్రోత్సహించి సాగు చేపడుతున్నారు. వీటి సాగు విధానం 60 సెం.మీ గుంతల్లో నాటుకోవాలి. హెక్టారుకు 400 మొక్కల వరకు ఎటు చూసినా మొక్కకు మొక్కకు 5 మీటర్ల దూరంలో నాటుకోవాలని తెలిపారు. ఇవి మూడు సంవత్సరాల తర్వాత నుంచి దిగుబడి మొదలవుతుంది.

అవకాడో

ఈ పంట సాగుకు నియోజకవర్గ పరిధిలో అనుకూలమైన నేలలు ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. వెచ్చని తేమ, అధిక ఎండ ఉన్న నేలలు అవకాడో సాగుకు అనుకూలంగా ఉంటాయని ఉద్యాన అధికారులు తెలిపారు. ఎకరాకు 160-170 వరకు మొక్కలు పెంచుకోవచ్చు. విత్తనాల ద్వారా సాగు చేస్తే 10 సంవత్సరాలకు దిగుబడి వస్తుంది. అదే అంటు మొక్కల ద్వారా అయితే 3-4 సంవత్సరాల్లో దిగుబడి మొదలవుతుంది. ఇది ప్రస్తుతం మంచి రేటు ఉన్న పంట.


బొమ్మవరంలో సాగులో ఉన్న వెదురు పంట

మక్కువ చూపుతున్న రైతులు..



నియోజకవర్గంలోని రైతులు సంప్రదాయ పంటలపై మక్కువ చూపుతున్నారు. నూతనంగా పరిచయమైన డ్రాగన్‌ఫ్రూట్‌ను వందలాది ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అలాగే ఆయిల్‌ఫామ్, అవకాడో వంటి నూతన పంటలు సాగు చేసేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అందుకు తగ్గట్టు తాము కూడా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, సాగు విధానాల గురించి రైతులకు వివరిస్తున్నాం.

- భాస్కర్, ఉద్యానశాఖాధికారి

ఏ పంట వేసినా నష్టపోయా..



ప్రతి యేటా ఎన్నో ఆశలు పెట్టుకొని పంటలు పండిస్తే చివరికి నష్టాలే మిగులుతున్నాయి. కొంతమంది సలహాలు, ప్రత్యామ్నాయ పంటలపై సామాజిక మాధ్యమాల్లో చూసి అధికారుల సలహాలతో ఆయిల్‌ఫామ్ సాగును అరటిలో చేపట్టాం. ప్రస్తుతం ఉన్న మామిడి చెట్లను తీసివేసి కొత్త పంటలు సాగు చేస్తున్నారు. తాను కూడా కొత్త ప్రయత్నం చేస్తున్నాను.

- శంకర్‌రెడ్డి, ఆయిల్‌ఫామ్ రైతు

చెన్నూరు బీఎల్వోలపై డీఆర్వో ఆగ్రహం

● ఓటర్ల జాబితా సరిపోల్చడంలో అలసత్వంపై మందలింపు



బీఎల్వోల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

చెన్నూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను సరిచేయాలని చెప్పినా ఇంతవరకు ఎందుకు సరిచూసి సక్రమంగా చేయలేదని చెన్నూరు బీఎల్‌వోలపై జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో శనివారం సాయంత్రం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీఎల్‌వోలను 1.1.2002 నుండి ఇప్పటి వరకు ఉన్న తేదీలో అప్పటి ఓటర్ల జాబితా చూసి ఇప్పటి ఓటర్ల జాబితాలో పాతవ్యక్తులు ఉన్నారా? ఇప్పటి వరకు ఉన్న వారిని సరిపోల్చాలని, జాబితా సక్రమంగా చేయాలని చెబితే ఎందుకు సరిచేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు ఇలాగేనా ఉండేదని, సస్పెండ్ చేస్తే దేవుడు కూడా కాపాడలేడని హెచ్చరించారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి ఈనెల చివరి నాటికి వంద శాతం పూర్తిచేయాలన్నారు. అలాగే బీఎల్‌వోలు వారి వారి పరిధిలో రోజూ కొంత సమయం కేటాయించాలని, మిగతా విధులు ఉన్న మాట వాస్తవమే అయినా కేంద్రం చెప్పిన బాధ్యత కూడా ముఖ్యమేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచరణి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


శ్రీచరణి తండ్రికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప స్పోర్ట్స్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా క్రికెట్ (వరల్డ్‌కప్)లో అద్భుత ప్రతిభ కనబరిచిన శ్రీచరణి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, జిల్లాకు పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆర్.మాధవి ఆకాక్షించారు. శ్రీచరణి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి వ్యక్తిగతంగా ఆర్థికసాయం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం స్థానిక శనివారం స్థానిక ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీచరణి తండ్రికి రూ.5లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో కడప క్రికెట్ స్టేడియం ఛైర్మన్ ఆర్.శ్రావణ్‌రాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్లేషణలు వ్యాపారాభివృద్ధికి కీలకం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విశ్లేషణలు వ్యాపార అభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటాయని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నిర్వహించిన క్రాస్-ఫంక్షనల్ మేనేజ్‌మెంట్ అనలిటిక్స్ ఫర్ బిజినెస్ సక్సెస్ రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్క్‌షాప్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందన్నారు. ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డీవీ శ్రీనివాసకుమార్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం డాక్టర్ సి.గణేష్‌కుమార్ వ్యాపార విశ్లేషణల ప్రాధాన్యంపై కీలక ప్రసంగాలు చేశారు. విభాగాధిపతి డాక్టర్ పి.సరిత వర్క్‌షాప్ విద్యార్థుల్లో డేటా సేకరణ, విశ్లేషణలో ఆధునిక అవగాహన పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూపాయి పతనంతో ఆర్థిక పరిస్థితి విచ్ఛిన్నం

● కార్మిక చట్టాలను నీరుగారుస్తున్న కేంద్ర ప్రభుత్వం ● ధ్వజమెత్తిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కడప మారుతీనగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రూపాయి విలువను పెంచి దేశ ఆర్థిక పరిస్థితిని గణనీయంగా మెరుగుపరుస్తామని మాట ఇచ్చిన ప్రధాని మోదీ దేశ ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేయడం తప్ప ప్రగతి సాధించేదేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా కేంద్రంలో ఉన్న బీజేపీ రూపాయి విలువను గణనీయంగా తగ్గించారని, మనతో పోల్చుకుంటే చైనా ఐదు రెట్లు జీడీపీ రేటుతో ముందుందన్నారు. విశాఖ స్టీలు ప్లాంటును ప్రైవేటుపరం చేయాలనుకుంటున్నారని, దీనివల్ల ప్రజలకు ఏం ప్రయోజనమని ఆయన ప్రశ్నించారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి రైతుల బతుకులను నట్టేట ముంచారన్నారు. కార్మిక చట్టాలను అణగదొక్కుతూ దళిత ఆదివాసీ, గిరిజన, మైనార్టీలపై దాడులు చేస్తూ వారిపై నక్సలైట్లు, సంఘ విద్రోహ శక్తుల ముద్ర వేసి పీడీ యాక్టు చట్టాలు ప్రయోగించడం ఒక్క మోదీకే చెల్లిందని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వెంకటశివ, బాదుల్లా, గుంటి వేణుగోపాల్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తెలుగుభాష, సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలి

● వైవీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ

కడప మారుతీనగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగుభాష, సాహిత్యంపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ సూచించారు. సీపీ బ్రౌన్ వర్ధంతి సందర్భంగా ఈనెల 6 నుండి 12వ తేదీవరకు వారోత్సవాలను వైవీయూ ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు శనివారం ప్రారంభ సమావేశంలో పద్యపఠన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆచార్య పిపద్మ హాజరై మాట్లాడారు. సీపీ బ్రౌన్ కృషి వల్లనే వేమన తెలుగు నేలలో చిరస్థాయిగా నిలచిపోయారన్నారు. వేమన పద్యాలను ఇవాళ పాట స్థాయిలో విద్యార్థులు చదువుకోగలుగుతున్నారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు గ్రంధాలయానికి వెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి, బ్రౌన్ గ్రంధాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సరైన అవగాహన కల్పించాలి


సందర్శన కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏలు తదితరులు

సీకేదిన్నె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారులు రైతులకు సరైన అవగాహన కల్పించి పంట దిగుబడులు పెంచేలా చూడాలని వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వర్షాలు అధికంగా కురవడంతో రైతులు పంటల సస్యరక్షణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటల్లో లోపాలు గుర్తించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు రైతులకు వివరించాలన్నారు. దీంతో రైతులు తెగుళ్లబారి నుండి పంటలను రక్షించుకుని దిగుబడులు పెంచుకుంటారన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కొర్రపాటి సునీల్‌కుమార్, వాకా మాధురి, శ్రీవల్లి, ఏడీఏలు నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్, ఏరువాక కేంద్రం సమన్వయకర్త క్రిష్ణప్రియ పాల్గొన్నారు.

పర్వతారోహణ శిక్షణ పూర్తి

● కోటిరెడ్డి కళాశాల విద్యార్థినులకు అభినందనలు


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష తదితరులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కడప పట్టణంలోని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సి.పావని, కె.జాహ్నవి హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో ఉన్న అటల్‌బిహారి వాజ్‌పేయి మౌంటెనీరింగ్, అలీడ్ స్పోర్ట్స్ సంస్థలో జరిగిన అడ్వెంచర్ శిక్షణను పూర్తిచేసుకున్నారు. శనివారం కడప నగరం కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి.విజయలక్ష్మీదేవి, డాక్టర్ పి.శచీదేవి అభినందించారు.

అంత్యక్రియలు నిర్వహించకుండా ఘర్షణ

మైదుకూరు డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం నాగిరెడ్డిపల్లిలో శ్మశానం కోసం ఇరువర్గాల మధ్య శనివారం ఘర్షణ వాతావరణం ఏర్పడింది. నాగిరెడ్డిపల్లికి చెందిన శివపురం పోలయ్య అనారోగ్య కారణంగా మరణించడంతో శనివారం దహన సంస్కారాలు చేయడానికి తీసుకువెళుతున్న సందర్భంలో సోమయాజులపల్లికి చెందిన బాలనాగయ్య తన పొలంలో నుంచి వెళ్లేందుకు అడ్డుపడడం జరిగింది. మృతుని బంధువులు ఇది తరతరాలుగా తమ గ్రామానికి చెందిన శ్మశాన స్థలమని, ఆ పొలంలోనే ఖననం చేయడానికి గొయ్యి తవ్వడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేసి పొలయజమాని బాలనాగయ్యను ఒప్పించారు. కాని మృతుని బంధువులు ససేమిరా ఒప్పుకోక పోవడంతో తహసీల్దారు రాజసింహానరేంద్ర రంగప్రవేశం చేసి ఇరువర్గాలను మందలించి శ్మశానానికి శాశ్వితంగా దారి ఇవ్వాలని ఆదేశించారు. శ్మశానానికి హద్దులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. అనంతరం తహసీల్దారు, సీఐ రమణారెడ్డి, ఎస్ఐ చిరంజీవి పోలీసుల సమక్షంలో మృతదేహానికి బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

గండికోట వెనుకజలాల్లో బాలుడి మృతదేహం లభ్యం

కొండాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వే బ్రిడ్జి సమీపంలో గండికో ట వెనుకజలాల్లో శనివారం బాలుడి మృత దేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... గండికోట వెనుకజాలల్లో పడిఉన్న మృతదేహాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో జాలర్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీ శారు. తాడిపత్రి పట్టణానికి చెందిన గంగాధర్(15)గా మృతదేహాన్ని గుర్తించారు. మృతికి గల కారణాలను విచారిస్తున్నట్లు కొండాపురం సీఐ రాజా తెలిపారు. గంగాధర్ తల్లిదండ్రుల స్వగ్రామం ముద్దనూరు మండలం గంగాదేవిపల్లె కాగా తాడిపత్రిలో నివాసం ఉంటున్నారు. గంగాధర్ తాడిపత్రిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నట్లు తెలిసింది.


గండికోట వెనుకజలాల్లో లభ్యమైన బాలుడి మృతదేహం

అంబేడ్కర్‌కు ఘన నివాళులు



అంబేడ్కర్‌కు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మన్సూర్‌అలీఖాన్

కడప మారుతీనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్‌లో కడప టీడీపీ నగర కమిటీ సభ్యులు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బేర్ హౌస్ డైరక్టరు శ్రీధర్, టీడీపీనగర కమిటీ ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, శిలాస్ వెంకటేశ్, పాలకొండ దేవస్థానం చైర్మన్ రెడ్డయ్య, డివిజన్ ఇన్‌చార్జ్ చిన్నబాబు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ



కడప క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శని వారం కడప స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ మూర్తి, జిల్లా పరిపాలన న్యాయ మూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని ఎస్పీ నచికేత్ విశ్వనాధ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పల్లెనిద్ర

లింగాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామన్నూతలపల్లెగ్రామంలోశని వారం పులివెందుల రూరల్ సీఐ ఎన్‌వీ రమణ పల్లెనిద్ర కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులకు సైబర్ క్రైమ్, మహిళలు,చిన్నపిల్లలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. సమస్యను ఆయన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏఎస్‌ఐ శేషయ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 118/2022

దుద్దెకుంట అశోక్‌వర్ధన్‌రెడ్డి తండ్రి చిన్న సోమిరెడ్డి, దాడితోట గ్రామము, తాడిమర్రి మండలం, అనంతపురం జిల్లా - వాది

V/s

1) శెట్టివారి భాస్కర్ S/o.శివప్ప, డి.నెం. 42/175-2, ఎన్‌జీఓ కాలనీ, కడప,
2) వంకదారి వేణుగోపాల్ తండ్రి వెంకటరమణ, హిందూ, వ్యాపారం, డి.నెం. 42/65-13-3, ఎన్‌జీఓ కాలనీ, కడపటౌన్ మరియు మండలం, కడపజిల్లా,
3) పెరుగోలే వెంకటరమణారెడ్డి తండ్రి సుబ్బారెడ్డి, డి.నెం. 1/156, అంకాలమ్మ గూడూరు గ్రామం, సింహాద్రిపురం మండలం - ప్రతివాదులు

దావా సమను

పైన తెలిపిన వాది, ప్రతివాదులపై పై కోర్టులో దావా దాఖలు చేసియున్నాడు. పైన తెలిపిన ప్రతివాది నెం.2 అయిన వంకదారి వేణుగోపాల్‌కు పై కోర్టులో 15-12-2025వ తేది ఉదయం 10.30 గంటలకు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనియెడల దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వి. కిషోర్‌కుమార్‌రెడ్డి
వాది తరపు న్యాయవాది, సెల్ : 9030449209

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. వెబ్‌సైట్: www.shriramfinance.me.
బ్రాంచ్ కార్యాలయము డి.నెం. 19/228 & 229, 2వ అంతస్తు, బి.వి.ఆర్. టవర్స్, గోకుల్ టవర్స్ ఎదురుగా,కడప

లాంఛనంగా స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022 వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించు టకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడ మైనది మరియు శాఖ కార్యాలయం కడప-1(ఇకపై కంపెనీ/లెండర్‌గా వ్యవహరించబడును)**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002(యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (SCUF) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఋణగ్రహీత ఈ క్రింది తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించ వలసినదిగా క్రింద ఉదహరించినబడిన తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

బకాయి సొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.06.12.2025** న లాంఛనంగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాదారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా:
1) **జి.సహదేవ రెడ్డి,** తండ్రి జి.మునిరెడ్డి, డి.నెం.1-724-బి, వై.ఎం.పల్లి, కడప- 516004
2) **శ్రీమతి జి.జ్యోతి** భర్త జి.సహదేవరెడ్డి డి.నెం.1-724-బి, వై.ఎం.పల్లి, కడప- 516004
3) **జి.సురేష్‌కుమార్** తండ్రి జి.రమణమూర్తి, ఫ్లాటునెం.302, శ్రీ చక్ర రెసిడెన్సీ, అమీర్‌పేట, హైదరాబాద్

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము: రూ.40,52,946/- (నలభై లక్షల యాభై రెండు వేల తొమ్మిది వందల నలభై ఆరు రూపాయలు మాత్రమే)
ఋణ ఖాతా నెంబరు : CUDP2TF1207130006
డిమాండ్ నోటీసు తేది: 11.09.2025

స్థిరాస్తుల వివరములు:-
కడప జిల్లా, కడప రూరల్ సబ్ జిల్లా, కడప మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కడప సిటీ, గూడూరు గ్రామలెక్కదాఖలా వార్డునెం.5, మసీదు వీధి, సర్వేనెం.136లో డి.నెం.5/17, మెట్ట సర్వేనెం.311/బి-1బిలో ఎ.0.55 సెంట్లు, మెట్ట సర్వే నెం.311/బి-2లో ఎ.6.27 సెంట్లు మరియు మెట్ట సర్వేనెం.311/బి1ఎలో ఎ.5.94 సెంట్లలో ప్లాటు నెం.40(భాగం), ప్లాట్లునెం.46, హద్దులు: తూర్పు:ప్లాటునెం.46ఎ, పడమర: క్రిష్ణారావుకు విక్రయించిన ప్లాటు నెం.40(భాగం), ఉత్తరం:ఇసికల బాలయ్య భూమి, దక్షిణం: 20అ. వెడల్పు గల రోడ్డు.

ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు 37.5 అ. లేదా 11.43 మీ. దక్షిణం వైపు: 36.5అ. 11.13 మీ. ఉత్తరం నుండి దక్షిణం: తూర్పు వైపు 36 అ. లేదా 10.98మీ, పడమర వైపు: 46అ. లేదా 14.03మీ. వెరశి ఎ.0.03 సెంట్లు 424 లింకులు లేదా 167.66 చ.గ. ఆస్తికి దక్షిణంవైపునున్న రోడ్డులోని దారి ప్యాసేజి హక్కు

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (SFL) అధీకృత అధికారి పైన పేర్కొబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తర్వాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖా ఆస్తులను దారి మళ్ళించుటకు గానీ SFL వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

ప్రదేశం: కడప/ జోనల్ కార్యాలయం
తేది: 06.12.2025
సం/- అధీకృత అధికారి,
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

పట్టించుకోరా..?

- పులివెందుల టు కడప నాలుగు వరుసల రహదారి ఆర్‌అండ్‌బీ అధికారులకు పట్టదా
- రోడ్డు మధ్యలోనే పెరుగుతున్న కంపచెట్లు



కడప-పులివెందుల రహదారి మధ్య పాకెట్ పార్క్‌లో పెరిగిన కంపచెట్లు

పులివెందుల టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులివెందుల-కడప నాలుగు వరుసల రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు మధ్యలోను అటు వైపు ఇటువైపు కంపచెట్లు పెరిగి వాహన దారులు ఇబ్బందులుపడే పరిస్థితులు నెలకొ న్నాయి. పేరుకే నాలుగు వరుసల రహదారి. ఈ రహదారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే.... కడప-పులివెందుల రహదారి పేరుకు మాత్రం నాలుగు వరుసల రహదారి. కానీ నిర్వహణను అధికారులు గాలి కొదిలేశారు. నాలుగు వరుసల రహదారి అంటే ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు దానిని గాలికి వదిలేశారు. రోడ్డుకు మధ్యలో ఏర్పాటుచేసిన పాకెట్‌పార్క్‌లో పూలచెట్లు అన్నీ క్రమంగా చనిపోయాయి. ప్రస్తుతం పూలచెట్ల బదులు కంపచెట్లు ఏపుగా పెరుగుతున్నాయి. ఈ కంపచెట్లు వాహన దారులను ఇబ్బందులు గురిచేస్తున్నాయి. ముఖ్యం గా వేంపల్లె-పులివెందుల మార్గమధ్యలో ఈ సమస్య ఎక్కువైంది. పాకెట్ పార్క్‌లో కాకుండా రోడ్డుకు అటువైపు ఇటు వైపు కూడా కంపచెట్లు పెరుగుతున్నాయి. పాకెట్ పార్క్‌లో పూలచెట్ల బదులు కంపచెట్లు పెంచుతున్నారా అనే విధంగా తయారైంది. ముఖ్యంగా టూవీలర్‌లో ప్రయా ణించే వారిని ఈ కంపచెట్లు ఇబ్బందులకు గురిచే స్తున్నాయి. వేగంగా వెళ్తున్నప్పుడు అక్కడక్కడ కంపచెట్లు ఉండడంతో అవి తగిలిగాయాలు చేస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి



నివాళులర్పిస్తున్న తుంగా రమణయ్య

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం నగరంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికివిశ్వప్రగతిచిట్స్‌ఎండీ,కడపజనసే న నాయకులు తుంగా రమణయ్య పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చిన ఈ సందర్భంగా తుంగా మాట్లాడు తూ భారత రాజ్యాంగనిర్మాతగా సామా జిక సంస్కర్తగా,ఆర్థికవేత్తగా, న్యాయవేత్త గా ఆయన దేశానికి, బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు స్మరించుకోవాలని ఆయన ఆశయాలను సాధించాలన్నారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోండి

కడప మారుతీనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ సమయాను కూలంగా త్వరితగతిన పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆర్. మాధవి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలతో ప్రజల వినతిపత్రాలను ఆమె స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నగర కోశాధికారి చంద్ర శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

అపరిచిత వ్యక్తుల వెంట వెళ్లవద్దు

చెన్నూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :గ్రామీణప్రాంతాలు, మరెక్కడైనా కానీ మనకు పరిచయం లేని వ్యక్తుల మాటలు నమ్మి వారి వెంట వెళ్లవద్దని ఏఎస్‌ఐ సుధాకర్ అన్నారు. శనివారం కొండపేటలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ అపరిచి వ్యక్తులు ఏ వస్తువులు ఇచ్చినా తీసుకోద్దని, వారితో ఫోనులో మాట్లాడడం చేయవద్దన్నారు. కార్యక్రమంలో యువతులు పాల్గొన్నారు.

జ్వరాలు, లార్వా సర్వే నిర్వహించాలి

సింహాద్రిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):జ్వరాలు, లార్వా సర్వే నిర్వహించాలని పులివెందుల సబ్ యూనిట్ అధికారి సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. సింహాద్రిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ రోటరీని శనివారం తనిఖీ చేశారు. నవంబరు, డిసెంబరు మాసాల్లో ఏమైనా మలేరియా, డెంగీ కేసులు నమోదు పై వివరాలు ల్యాబ్ టెక్నీషియన్ శ్రావణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలకు సిద్దయ్య సూచనలిస్తూ, తప్పని సరిగా గ్రామాల్లో పర్యటిస్తూ, ప్రతి ఇంటికి వెళ్లి జ్వరాలు, లార్వా సర్వే నిర్వహించాలన్నారు. ప్రజలకు ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో అంబేడ్కర్ వాదులు

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమీకరించు, బోధించు అంటూ అందరికీ విజ్ఞానాన్ని పంచడమే అంబేడ్కర్‌కు మనమిచ్చే ఘన నివాళి అని కుల సంఘ నేతలు స్పష్టం చేశారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కోటిరెడ్డి సర్కిల్లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు ఇరగయ్య, ఓబులేసు, లెనిన్ ప్రసాద్, పల్లెంకొండ సంపత్, చైతల్య , అంబేడ్కర్ నేషనల్ విజన్ ట్రస్ట్ ప్రతినిధులు తదితరులుపాల్గొన్నారు.

'నా బిడ్డ ఆచూకీ తెలపండి'

ముఖ్యమంత్రికి లేఖ రాసిన కడపకు చెందిన మహిళ

కడప క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మూగ, చెవుడు ఉన్న తమ బిడ్డ అదృశ్యం అయ్యిందని ఆచూకీ గుర్తించ డంలో పోలీసులు సరైన చర్యలు తీసుకోలేదంటూ కడప సాయిపేటకు చెందిన షేక్ షమీమ్ ముఖ్యమంత్రి చంద్ర బాబుకు ఫిర్యాదు చేశారు.

తన బిడ్డ అఫ్రోజ్‌కు మూగ, వినికిడి లోపం ఉందని సాయిపేట మార్కెట్ దగ్గర అక్టోబరు 27న అదృశ్యం అయ్యిందని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారన్నారు. తన కుమార్తెను గుర్తించడంలో పోలీసులు చర్యలు తీసుకో వాలని ఫిర్యాదులో పేర్కొంది.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరంలో పశువులను పరీక్షిస్తున్న వైద్యులు

సీకేదిన్నె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పశువైద్య శిబి రాలను సద్వినియోగం చేసుకుని పాడి పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం పశువిజ్ఞాన శాస్త్రవేత్త డా క్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట గ్రామంలో శనివారం ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ కెమికల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ సంస్థ సహకారంతో వైద్యశిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. స్థానిక పశువైద్య అధికారి శివ రామిరెడ్డి 90 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్య క్రమంలో పశువైద్య సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆహ్లాదకర వాతావరణం



చెత్తాచెదారాలను తొలగిస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మన పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకర వాతావరణం నెలకొని ఉంటుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీ వద్ద మూడో రోజు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో చెత్తా చెదారాలు, పిచ్చిమొక్కలు తొలగించారు. ఆసుపత్రి ఆవరణంలో మొక్కలు నాటడానికి వీలుగాపాదులను తీశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి

పులివెందుల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు హాస్టల్స్‌లో ఉంటూ చదువుకునే విద్యార్థులు ఎలాంటి ర్యాగింగ్‌లకూ పాల్పడకూడదని అర్బన్ సీఐ సీతారామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏపీకార్ల్‌లో ఉన్న హార్టికల్చర్ కళాశాలల యాంటీ ర్యాగింగ్,సైబర్ నేరాలుపై, టోల్‌ఫ్రీ నెంబర్లు, యువశక్తి తదితర వాటిపై అర్బన్ సీఐ విద్యార్థులకు అవాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు తదితరులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో సీఐ సీతారామిరెడ్డి మొక్కలు నాటారు.

ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తే చర్యలు తప్పవు

పులివెందుల టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని దుకాణాలలో ప్లాస్టిక్‌కవర్లు కనిపిస్తే చర్యలుతప్పవని మున్సిపల్ కమిషనర్‌రాముడు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని హోటళ్లు, దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్‌కవర్లు,ప్లాస్టిక్ క్యారీబ్యాగులనుస్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిషేధితసింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే దుకాణం, హోటల్ లైసెన్సులను రద్దుచేసి, జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ శానిటరీసెక్రటరీలు, సిబ్బందిపాల్గొన్నారు.

టెండర్ వేసిన రోడ్లను పూర్తిచేయాలి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని 15వ డివిజన్ శివానందపురం రోడ్డునెంబర్ 4,5లో సిమెంటు రోడ్డు ఇప్పటి వరకు మూడు దఫాలుగా టెండర్లు వేసి అలాగే వదిలేస్తున్నారని, త్వరగారోడ్డు వేయాలని సీపీఎం కడపనగర కమిటీ నాయకులు కోరారు. శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవిని ఆమె గృహంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు దాసరినరసింహ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

సీఎంకు ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి వినతి



కమలాపురం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించి నిధులు ఇవ్వాలని సీఎంను కోరామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శనివారం రాజధాని అమరా వతిలో ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గానికి అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని కోరామన్నారు. అదే విధంగా సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టు పనులు పూర్తికి నిధులు కేటాయించాలన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని, అదే విధంగా పారిశ్రామికవాడలో ఇంకా పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరామన్నారు. కమలాపురం లో ఉన్న ప్రధాన సమస్య ఫ్లైఓవర్ బ్రిడ్జి అని నిధులు కేటాయించి త్వరగా పనులు పూర్తయ్యేందుకు సహకరించాలని సీఎంను కోరినట్లు తెలిపారు. అందుకనుగుణంగా సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

స్టాప్, వాష్ అండ్ గో

కడప క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో పలుచోట్ల స్టాప్, వాష్ అండ్ గో ..కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ ఆదేశాలతో కార్లు, లారీలు, బస్సులు, వ్యాన్లు తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపారు. జాతీయ రహదారులపై స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు నగరంలో పలు కూడళ్ల వద్ద శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారిపై వెళుతున్న కార్లు, లారీలు. బస్సుల, వ్యాన్లు తదితర వాహనాలను ఆపి డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపించారు. నిద్ర మత్తు నుంచి తేరుకునేలా వాష్‌తో పాటు కొంచెం టీ కూడా తాగమని పోలీసులు తెలిపారు.

గ్రామ స్వరాజ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం - బీటెక్ రవి

సింహాద్రిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామాల అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్‌రవి) పేర్కొన్నారు. మండలంలోని నంద్యాలంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి బీటెక్ రవి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వేంపల్లి మండల ఇన్‌చార్జ్ రఘునాథరెడ్డి, తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మెన్ మారెడ్డి జోగిరెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ సుధాకర్‌రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప మారుతీనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు. పేదలకు భరోసాగా శని వారం స్థానిక ద్వారకానగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మరో విడత సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 29 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ఇప్పటివరకు కడప నియోజకవర్గంలో మొత్తం 351 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా దాదాపు రూ. 3.5 కోట్ల రూపాయల ఆర్థిక సాయాన్ని మంజూరు చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, నగర కోశాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, వెంకటేష్‌ఆచారి, చిన్నబాబు, మనోజ్‌కుమార్ తదితరులున్నారు.

వాచ్‌మెన్‌కు కనీస వేతనాలు అమలు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):వాచ్‌మెన్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, ప్రభుత్వ వాచ్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిని పరామర్శించిన శేషారెడ్డి

వేముల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సిద్దయ్యను శనివారం ఆ పార్టీ నాయకుడు పేర్ల శేషారెడ్డి పరామర్శించారు. అనారోగ్యం కారణంగా ఇంటి వద్దనేవిశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న శేషారెడ్డి ఆయన ఇంటికెళ్లి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఆయన వెంట సింగిల్ విండో రాగిపిండి సుధాకర్‌రెడ్డి, వీరారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

పేదల పక్షాన ఎర్రజెండా

కడప నాగరాజుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన వారి అభివృద్ధికి అండగా నిలిచే జెండా ఎర్రజెండానే అని,ఎర్రజెండాపేదల కోసమేపనిచేస్తుందని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మీదేవి, చాపలసుబ్బరాయుడు,మడగలం ప్రసాద్ అన్నారు. శని వారం ఆర్కేనగర్‌లో ఇంటి స్థలాలదరఖాస్తుల పంపిణీనమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ చలో కార్పొరేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రవి,చిన్నోడు పాల్గొన్నారు.

మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు

కడప క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పోలీసు అధికారులు, సిబ్బంది శనివారం మహిళా భద్రతపై విస్తృతంగా అవగాహన కార్య క్రమాలు నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే మానసిక, శారీరక, సామాజిక నష్టాలపై ఉదాహరణలతో వివరించడం జరిగింది. సైబర్ మోసాలపై వివరించారు.

వైవీయూలో అంబేడ్కర్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వ విద్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్, మౌలానా ఆజాద్ నేషనల్‌ఉర్దూ యూనివర్సిటీప్రొఫెసర్ జివిరత్నాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్‌పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్

పులివెందుల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా బీఆర్ అంబేడ్కర్ చిరస్థాయిగా నిలిచిపోయారని పలువురు పేర్కొన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకొని స్థానిక గరండాల్ బ్రిడ్జి వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి వాజ్‌పేయినాయుడు, దేరంగుల ప్రశాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మాజీ ఉపముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాష, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, బీసీ, మైనార్టీ, మహిళా విభాగాలనేతలు,కార్పొరేటర్లు,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

త్యాగరాజు కాలనీని సందర్శించిన ఆర్డీవో

బద్వేలు, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని త్యాగరాజు కాలనీని శనివారం ఆర్డీవో చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులపై ఆరా తీశారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థసక్రమంగా లేని కారణంగా అక్కడ మురుగు నీరు నిల్వ ఉండడాన్ని వారు గమనించారు. తాత్కాలికంగా మురుగునీరు వెళ్లేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు హద్దులను ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. పట్టణ అభివృద్ధికి కేటాయించిన నిధులతో ఈ పనిని కూడా పూర్తి చేస్తామని తెలిపారు.

సమాజ స్ఫూర్తి ప్రధాత అంబేడ్కర్

● రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, దళిత, ప్రజా సంఘాల నేతలు

ప్రొద్దుటూరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) : సమాజ స్ఫూర్తి ప్రధాత డాక్టర్ బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేడ్కర్ అని వక్తలు కొనియాడారు. శనివారం అంబేడ్కర్ వర్థంతి సందర్భంగా స్థానిక మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ , మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, కమాల్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జాకీర్, మాజీ కౌన్సిలర్ పుల్లయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



అనాథ పిల్లల మధ్య అంబేడ్కర్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం



జమ్మలమడుగులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న భూపేశ్‌రెడ్డి

అనాథ శరణాలయంలో పండ్లు పంపిణీ

పట్టణంలోని విద్యార్థి అనాథ శరణాలయంలో మాలమహానాడు చెన్నయ్యవర్గం జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్ ఆధ్వర్యంలో అనాథ విద్యార్థులకు పండ్లు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సుదర్శన్ ప్రకాశం జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు వెంకటన్న బేరీ, సత్యం జేష్టాది మధు పాల్గొన్నారు. కాగా జనసేన పార్టీ నేత శివ మురళీ రామారావు, జైభీమ్ రావ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె రమేష్, దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ నేత నరసింహులు, మాల మహానాడు జాతీయ కన్వీనర్ మనోహర్, ఎంపీజే రాయలసీమ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ రాష్ట్ర కార్యదర్శి సలీమ్, బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు

జమ్మలమడుగులో: భారతదేశం గర్వించే నాయకుడు భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జమ్మలమడుగు తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు పాత బస్టాండులో అంబేడ్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జమ్మలమడుగు మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, పొన్నతోట శ్రీను, మల్లికార్జున, ఐఎల్‌చిన్న, జైపాల్, గౌస్ అహమ్మద్, తదితర నాయకులు పాల్గొన్నారు. అనంతరం జమ్మలమడుగు జనసేన కోఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నేతలు దిగువపట్నం కాలనీ, బూత్ ఇన్‌చార్జి వినయ్, ఉదయ్, జాషువా, లక్షుమయ్య, పుష్పరాజ్, రఫి, బన్ని, సాల్మన్ పాల్గొన్నారు.

బద్వేలులో: రాజ్యాంగ నిర్మాత, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ వర్ధంతిని శనివారం మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ మేనేజర్ హరినాథ్‌లు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవళి వేణుగోపాల్ పట్టణంలోని అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు గోవిందాయపల్లె క్రిష్ణయ్య , ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మైదుకూరులో: మైదుకూరులో రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కూశెట్టి పాలకొండయ్య ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ దేశానికి, బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలను స్మరించుకొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రామమోహన్, చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, ఆనందరావు, సురేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో: మండలంలో అంబేడ్కర్ 69 వ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయంలో దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్టీ కాలనీలో ఏపీటీఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు దేరాజ్యోతి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



బద్వేలులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



కలసపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలసపాడులో శనివారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం పడిపూజమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉమామహేశ్వరస్వామి దేవాలయం నుంచి మూడు రోడ్లకూడలి వరకు ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. రాజుపాలెం గ్రామానికి చెందిన పోకల మల్లికార్జునరెడ్డి అన్నదానం ఏర్పాటుచేశారు. సాయంత్రం కన్నెస్వాములు, అయ్యప్ప బృందంచేకలశాలు, చిన్నారులతో ప్రమిదల వెలుగులు, భజనలతో, డప్పు వాయిద్యాలు, కోలాట బృందాలు పోటాపోటీగా భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



జమ్మలమడుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో పెన్నానది వంతెన పక్కన వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం రాత్రి అయ్యప్ప స్వాములు అంబలం పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అంబలంపూజ కార్యక్రమానికి సమీప మహిళా భక్తులు, అయ్యప్పలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పరిహారం అందేలా చూస్తాం

పోరుమామిళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం అందేలా చూస్తామని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం చెన్నారెడ్డిపేటలో గ్రామసభలు నిర్వహించారు. అమరావతి - బెంగళూరు జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల్లో ఎంత మందికి అవార్డు వచ్చింది, ఎంత మందికి రాలేదు దీనికి సంబంధించిన పూర్తి వివరాలు అందిస్తే వారికి నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు చాలా మంది గ్రామసభల్లో పాల్గొని తమ సమస్యలు విన్నవించారు.

ప్రొద్దుటూరు టూటౌన్ ఎస్ఐగా మహబూబ్‌బాషా



ప్రొద్దుటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు టూటౌన్ ఎస్ఐగా మహబూబ్ బాషా శనివారం స్టేషనుకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న ఎస్ఐ ధనుంజయుడు దువ్వూరుకు బదిలీ పై వెళ్లగా కడప వీఆర్ నుంచి బదిలీపై ప్రొద్దుటూరు టూటౌన్‌కు మహబూబ్ బాషా వచ్చారు. అనంతరం సీఐ సదాశివయ్యను కలిశారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ శివప్రసాద్ . శనివారం మండలంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడికి లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని ప్రజలను ఎవరినీ కూడా ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. ఏదైనా గొడవ జరిగితే పోలీసులకు తెలపాలని ఎస్ఐ శివప్రసాద్ డ్రైవర్లకు వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కేంద్రం చేతుల్లో రాష్ట్రం కీలుబొమ్మ

జమ్మలమడుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేతుల్లో రాష్ట్ర ప్రభుత్వం కీలుబొమ్మగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం సున్నపురాళ్లపల్లె కన్నెతీర్థం గ్రామాల మధ్య స్టీల్‌ప్లాంట్ శిలాఫలకాన్ని ఆయన సందర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్టీల్‌ప్లాంట్ పనులను వేగవంతంగా చేయాలని చెప్పడం తప్ప చేసేది ఏమీలేదన్నారు. కేంద్ర ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమను నిర్మించాల్సినప్పటికి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు లక్ష్యమని బ్రహ్మంగారిమఠం బ్రాంచ్ మేనేజరు నాగార్జున పేర్కొన్నారు. శనివారం బ్యాంకు ఆవరణలో సీపీఆర్ఎం సమావేశాన్ని వెలుగు సిబ్బందితో చేపట్టారు. ఈ సమావేశానికి మండల సమాఖ్య ఏపీఎం చిన్న ఓబులేసు, కమ్యూనిటీ కోఆర్డినేటరు నారాయణ గ్రామసంఘం అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్

పోరుమామిళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మను మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సుప్రజా మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె తన వంతు సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని హామీ ఇచ్చారు. పోరుమామిళ్లలోని పుల్లీడు సమీపంలో ఉన్న మినీ మార్కెట్‌యార్డు గురించి చర్చించారు. మినీ మార్కెట్‌యార్డు పూర్తయితే నియోజకవర్గ రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల బీజేపీ మండల అధ్యక్షుడు నారిశెట్టినాగేంద్ర, అసెంబ్లీ కోకన్వీనరు పండరి, మోహన్‌రెడ్డి, రమణాచారి, ఏఎంసీ డైరెక్టరు సుబ్బారావు పాల్గొన్నారు.

చిటిమిటి చింతలలో సమావేశం

జమ్మలమడుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని చిటిమిటి చింతల గ్రామంలో శనివారం జమ్మలమడుగు నియోజకవర్గ మండల, గ్రామ కమిటీల నియామక అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పంచాయతీలలో, గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

బద్వేలు వ్యవసాయశాఖ పరిశోధన కేంద్రం పరిశీలన

బద్వేలుటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజవర్గంలోని వ్యవసాయశాఖకి సంబంధించిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల పరిశోధన కేంద్రాన్ని మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుప్రజ పరిశీలించారు. రైతన్నలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల వాడకాన్ని అందుబాటులో ఉండే విధంగా కృషిచేయాలని, రైతుల శ్రేయస్సుకోసం ఉపయోగ ఎడే విధంగా ఉండాలని సూచించారు.

ఎస్ఐఆర్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

● బీఎల్‌వోల సమావేశంలో డీఆర్‌వో విశ్వేశ్వరనాయుడు



సమావేశంఓ మాట్లాడుతున్న డీఆర్‌వో విశ్వేశ్వరనాయుడు

ప్రొద్దుటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమగ్రమైన పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించాలనే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇన్‌సెన్టివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎస్ఐఆర్ 2002 ఓటరు జాబితా ప్రకారం 2025 ఓటరు జాబితాతో బేరీజు వేసుకొని ఓటరు మ్యాపింగ్ చేయాలని ఆయన అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభా భవనంలో నియోజకవర్గంలోని బీఎల్‌వోలు సూపర్‌వైజర్లతో ఎస్ఐఆర్‌పై శిక్షణా కార్యక్రమంలో డీఆర్‌వో మాట్లాడుతూ ఈ ఎస్ఐఆర్‌లో ఇంటింటికి వెళ్లి తనిఖీ చేసి ప్రతి ఓటు పరిశీలించి మ్యాపింగ్ చేయాలన్నారు. ఇందులో మరణించిన వారు, ఇతర ప్రదేశాలకు వెళ్లిన వారు అర్హతలేని వారు, గుర్తించి తొలగించాలన్నారు. ఒక ఓటరుకు ఒకటికి మించి ఇతర చోట్ల కూడా నమోదైతే వాళ్లను గుర్తించి తొలగించాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రంగస్వామి , తహసీల్దారు గంగయ్య, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఎలక్షన్ డీటీ అజయ్‌బాబు. ఆర్ఐ నాగమోహన్ రెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను ఒకే డోర్ నంబరులో చేర్చండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారిణి శాంతమ్మ

చాపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రజలకు సంబంధించిన ఓటర్లను వారి కుటుంబాల ఆధారంగా ఒకే డోర్ నంబరులోకి చేర్చాలని మైదుకూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి శాంతమ్మ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఓటర్లపై బీఎల్‌వోలకు సమావేశంలో మాట్లాడుతూ 2002 నుంచి 2025 వరకు ఉన్న ఓటర్లకు సంబంధించిన కుటుంబ సభ్యులను వారికి సంబంధించిన ఒకే డోర్ నంబరులోకి చేర్చాలన్నారు. మండలంలో మొత్తం 32,564 మంది ఓటర్లు ఉండగా వారిలో 11,811 మంది ఓటర్లను ఒకే డోర్ నంబరులోకి మార్చాల్సి ఉందన్నారు. మైదుకూరు తహసీల్దారు నరేంద్రవర్మ, చాపాడు తహసీల్దారు రామాకుమారి, ఏవో రామానుజం, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాలపై అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలపై ఈనెల 7వ తేదీ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సృజన్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కె.సునీల్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో విడుదల కాబోతున్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఆదివారం ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేశామని, నిరుద్యోగ యువత, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిపుణులతో అవగాహన కల్పిస్తామని, అలాగే గ్రాండ్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షల సిలబస్, మెటీరియల్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. బ్యాంకు, ఎస్ఎస్‌సీ, రైల్వే, టెట్, డీఎస్సీ, పోలీసు, గ్రూప్స్ ఉద్యోగాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు. గ్రాండ్ టెస్ట్‌లో ప్రతిభ కనపరిచిన వారికి మొదటి బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నకిలీ నోట్ల వ్యవహారంపై పోలీసుల విచారణ

ప్రొద్దుటూరు , డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నకిలీ నోట్ల చలామణి జరుగుందనే సమాచారం మేరకు మండల పరిధిలోని శంకరాపురం గ్రామానికి చెందిన ఇద్దరు అనుమానితులను రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విచారణలో వారు నకిలీ నోట్లు చలామణి చేయలేదని వాపోయినట్లు సమాచారం. కాగా హైదరాబాదులో స్థిరపడిన ప్రొద్దుటూరుకు చెందిన ఓ మహిళ నుంచి తాము బాకీ డబ్బులు తీసుకున్నామని ఆ డబ్బులో నకిలీ నోట్లు వచ్చాయని పోలీసుల విచారణలో వెల్లడించినట్లు సమాచారం. అయితే ఆ మహిళ కోసం పోలీసులు వేట సాగిస్తున్నారు. నకిలీ నోట్ల సూత్రధారి అయిన ఆ మహిళ దొరికితే ఈ గుట్టు రట్టు కాగలదని పోలీసులు చెబుతున్నారు.

చెట్టుకు ఉరివేసుకొని యువకుడు బలవన్మరణం

ప్రొద్దుటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్ రెడ్డి నగర్‌కు చెందిన యువకుడు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్ఐ రాజు తెలిపిన వివరాల మేరకు గోటూరు వెంకటేష్ (22) అనే యువకుడు 10 వరకు చదువుకున్నాడు. తండ్రి శ్రీనివాసులు పాత చీరల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన కుమారుడు ఏ పనిచేయ కుండా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసై ఇంట్లో తరుచూ గొడవ పడుతూ ఉండేవాడని శుక్రవారం రాత్రి ఇంటికి రాలేదని శనివారం పొద్దున పెన్నానది ఒడ్డున ఓ ఆయిల్‌మిల్లు ఏరియాలో చెట్టుకు శవమై వేలాడుతూ కనిపించాడన్నారు. నదిలో ఇసుకకు వెళ్లి ఎడ్ల బండివాళ్లు చూసి చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. కాగా అతను మద్యం మత్తులో ఇలా చేశాడా? లేదా అతన్ని వేరే ఎవరైనా చంపి ఇలా చెట్టుకు వేలాడదీశారా? అని ఆప్రాంత వాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మైదుకూరు డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గగ్గితిప్ప వద్ద 167 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెనియని వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. బి.కోడూరు మండలం సిద్దుగారిపల్లికి చెందిన నేలటూరు సిద్దారెడ్డి, ఆదిలక్షుమ్మ, లక్షుమమ్మలు మైదుకూరు నుంచి ద్విచక్ర వాహనంపై సిద్దుగారిపల్లికి వెళుతుండగా గుర్తు తెనియని వాహనం ఢీకొని ముగ్గురికీ తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో ఇద్దరిని మైదుకూరు ఆసుపత్రికి, ఒకరిని కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.